నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-7-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 298 పేజీలు: 4 వెల: రూ.1/-

ముగిసిన గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబె చరిత్ర

పోలీస్ ఎన్‌కౌంటర్‌లో దుర్మరణం చెందిన దూబె

కాన్పూర్‌కు తరలిస్తుండగా ఎన్‌కౌంటర్ ఘటన

లక్నో,జూలై10(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో 8 మంది పోలీసుల కాల్చేసిన ఘటనలో ప్రధాన నిందితుడు, గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబే ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో గురువారం పట్టుబడ్డ అతడిని ప్రత్యేక వాహనంలో కాన్పూర్‌కు తరలిస్తుండగా.. పోలీసుల ఎస్కార్ట్‌లోని ఆ వాహనం బోల్తా పడింది. దీనిని అదునుగా తీసుకున్న వికాస్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో గాయపడిన అతడిని కాన్పూర్ ఆస్పత్రికి తరలించగా.. అతడు మరణించినట్లు తెలుస్తోంది. వికాస్‌ను పట్టుకునే క్రమంలో ఇద్దరు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్‌లో నేర సామ్రాజ్యం నిర్మించుకున్న వికాస్ దూబేను పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడి అనుచరులు..

పోలీసులపై కాల్పులకు తెగబడిన విషయం తెలిసిందే. గత గురువారం జరిగిన కాన్పూర్ సమీపంలోని బిక్రూ గ్రామంలో ఈ ఘటనలో డీఎస్పీ సహా మొత్తం 8 మంది పోలీసులు నేలకొరిగారు. ఈ క్రమంలో వికాస్ అనుచరుడు దయా శంకర్ అగ్నిహోత్రిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో భాగంగా అతడు సంచలన విషయాలు వెల్లడించాడు. పోలీసులు బిక్రూ గ్రామానికి వచ్చే ముందే వికాస్‌కు ఓ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని అతడు వెల్లడించాడు. దీంతో అప్రమత్తమైన అతడు.. తన అనుచరులకు ఫోన్ చేసి 25-30 మంది.. పోలీసులను అడ్డుకునేలా పథకం రచించాడని తెలిపాడు. ఈ పరిణామాల నేపథ్యంలో పలువురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇక పోలీసులపై కాల్పులు జరిపిన అనంతరం వికాస్ రాష్ట్రం విడిచి పారిపోగా.. అతడి ఆచూకీ చెప్పిన వారికి నగదు బహుమతి ఇస్తామని పోలీసు శాఖ ప్రకటించింది. అయినప్పటికీ అతడి గురించి ఎటువంటి సమాచారం తెలియకపోవడంతో రూ. 50 వేల నుంచి 5 లక్షలకు రివార్డును పెంచారు. ఈ క్రమంలో ఎట్టకేలకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహంకాలి ఆలయంలో అతడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులు వికాస్‌ను అరెస్టు చేయగా.. అక్కడికి చేరుకున్న యూపీ పోలీసులు అతడిని ప్రత్యేక వాహనంలో శుక్రవారం ఉదయం కాన్పూర్‌కు తీసుకు వచ్చే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఎస్కార్ట్‌లోని వాహనం బోల్తా పడటంతో వికాస్ పారిపోయేందుకు ప్రయత్నించగా కాల్పులు జరిపారు. ఇక గురువారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో దూబే అనుచరులు కార్తికేయ, ప్రవీణ్ అలియాస్ బవువా హతమైన విషయం తెలిసిందే.

సుప్రీంలో పిల్ దాఖలు

దాదాపు 60 కేసుల్లో ముద్దాయిగా ఉన్న అతడు.. ఎనిమిది మంది పోలీసులను పొట్టనబెట్టుకున్న దూబే వారం రోజులుగా తప్పించుకు తిరగడం, అనూహ్యంగా మధ్యప్రదేశ్ పోలీసుల చేతికి చిక్కడం.. తీరా విచారణ కోసం యూపీకి తీసుకువస్తున్న సమయంలో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరీ ముఖ్యంగా పోలీసులు, రాజకీయ నాయకులతో అతడి సంబంధాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు జరగడం సహా బీజేపీ పాలిత రాష్ట్రంలో నేరానికి పాల్పడిన అతడు.. మరో బీజేపీ పాలిత రాష్ట్రంలో పట్టుబడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు వికాస్ దూబే కోర్టులో లొంగిపోయేందుకు ప్రయత్నించాడని.. అదే విధంగా ఓ టీవీ చానెల్ లైవ్‌లో తన ఆచూకీ గురించి తానే తెలియజేసేందుకు ప్రయత్నించాడనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబే ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో దర్యాప్తు జరపాలని సుప్రీంకోర్టులో తాజాగా పిల్ దాఖలైంది. అతడితో పాటు అతని ఐదుగురు అనుచరులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టారని సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషనర్ వ్యాజ్యం దాఖలు చేశారు. కోర్టు పర్యవేక్షణలో సీబీఐ చేత విచారణ జరిపించాలని కోరారు. ఈ నేపథ్యంలో వికాస్ దూబే నేర చరిత్ర, అతడు ఎదిగిన తీరు, ఇందులో పోలీసులు, రాజకీయ నాయకుల పాత్ర.. నేర సామ్రాజ్యం పతనం కావడానికి గల కారణాలు విస్తుగొలిపేలా ఉన్నాయి.

సచివాలయంలో పోచమ్మ గుడి, మసీదుకు నష్టం

కొత్త సచివాలయంలో పునర్నిర్మాస్తామన్న సిఎం

కాకతాళీయంగా జరిగిన ఘటనగా సిఎం కెసిఆర్ వివరణ

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): సచివాలయ భవనాల కూల్చివేతతో ఇప్పటికే ఉన్న ఆలయం, మసీదుకు ఇబ్బంది కలగడంపై సీఎం కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. సచివాలయ స్థలంలోనే ప్రభుత్వ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో ఆలయం, మసీదు నిర్మిస్తామన్నారు. భవనాలు కూల్చే క్రమంలో ప్రార్థనామందిరాలపై శిథిలాలు పడి కొంతనష్టం జరిగిందని తెలిపారు. ఇలా జరగడంపట్ల ఎంతో చింతిస్తున్నానని, ఇది కాకతాళీయంగా జరిగిందని, అందరూ సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సిఎంవో ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రార్థనామందిరాలకు ఇబ్బంది కలిగించడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. ఎన్నికోట్లయినా వెనుకాడకుండా ఆలయం, మసీదు నిర్మిస్తాం. పూర్తి ప్రభుత్వ ఖర్చుతో నిర్మించి వాటిని సంబంధిత వ్యక్తులకు అప్పగిస్తాం. దేవాలయం, మసీదు నిర్వాహకులతో నేనే త్వరలోనే సమావేశమవుతాను. వారి అభిప్రాయాలు తీసుకుని, కొత్త సెక్రటేరియట్ భవన సముదాయంతో పాటుగా ప్రార్థనా మందిరాలను నిర్మించి ఇస్తామని హామీ ఇస్తున్నాను అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. 'తెలంగాణ సెక్యులర్ రాష్ట్రమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ లౌకిక స్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సచివాలయంలో పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మించడమే ప్రభుత్వ ఉద్దేశ్యం తప్ప ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలిగించడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. ఇది కాకతాళీయంగా జరిగిన సంఘటన. దీన్ని అందరూ సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరారు.

కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతించిన ఓవైసీ

సచివాలయం ప్రాంతంలోనే కొత్త ఆలయం, మసీదు కట్టిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనను ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు. సచివాలయంలోని పాత భవనాల కూల్చి వేత సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న ఆలయం, మసీదు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీంతో వాటిని కూడా తీసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. ఆలయం, మసీదులకు ఇబ్బంది కలగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. సచివాలయం ప్రాంతంలోనే ప్రస్తుతం ఉన్న వాటికంటే విశాలంగా, సౌకర్యవంతంగా ఆలయం, మసీదును నిర్మిస్తామని, వాటికోసం అయ్యే ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుందని సీఎం ప్రకటించారు. ఈ ప్రకటనపై అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్ వేదికగా స్పందించారు. సీఎం ప్రకటనను స్వాగతిస్తున్నానని తెలిపారు. యునైటెడ్ ముస్లిం ఫోరం తరఫున పూర్తి స్టేట్‌మెంట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

సిఎం సహృదయతపై ఎన్జీవోల హర్షం

కొత్తగా నిర్మించనున్న సచివాలయ ప్రాంగణంలో దేవాలయం, మసీదులను కూడా కొత్తగా నిర్మిస్తామని, అందుకు పూర్తిగా ప్రభుత్వ నిధులనే వినియోగిస్తామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రకటించడపట్ల తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం హర్షం ప్రకటించింది. సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు, రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ఉద్యోగులకు, ప్రజలకు భరోసాను, నమ్మకాన్ని కొత్త మసీదు, దేవాలయాలు కలిగిస్తాయని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓఏ) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కారం రవీందర్ రెడ్డి, మామిళ్ళ రాజేందర్ పేర్కొన్నారు.

కాగా... సచివాలయ భవనాలు కూల్చివేస్తున్న సందర్భంగా మసీదు, నల్ల పోచమ్మ దేవాలయాలు ధ్వంసం కావడంపట్ల బాధను వ్యక్తం చేస్తూ గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్... తక్షణమే స్పందించి నూతన సచివాలయంలో అందరి మనోభావాలకు అణుగుణంగా మసీదును, నల్ల పోచమ్మ దేవాలయాలను నిర్మిస్తామని చెప్పడం ఆయన సహృదయతకు, సెక్యులరిజానికి నిదర్శనమని పేర్కొన్నారు.ం

సౌరవిద్యుత్‌తో భవిష్యత్ అవసరాలకు పునాది

విద్యుత్ రంగంలోనూ స్వయం సమృద్ధి కీలకం

మధ్యప్రదేశ్‌లో ఆసియాలోనే అతిపెద్ద సౌరవిద్యుత్ పార్కు

ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ,జూలై10(ఆర్ఎన్ఎ): శుద్ధ ఇంధన రంగంలో ప్రపంచంలోనే ఆకర్షణీయ మార్కెట్‌గా భారత్ ఎదిగిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రీవాలో ఆసియాలోనే అతిపెద్ద సౌరవిద్యుత్ పార్కు ఏర్పాటైంది. 750 మెగావాట్ల సామర్థ్యం గల ఈ పార్కుని శుక్రవారం ప్రారంభించిన మోదీ.. దీన్ని జాతికి అంకితం చేశారు. దీంతో మధ్యప్రదేశ్ శుద్ధ, సౌర ఇంధనానికి కేంద్రంగా ఎదుగుతుందని ఆకాంక్షించారు. సౌరశక్తి శుద్ధమైన, భద్రతమైన, భరోసా కల్పించే ఇంధనమని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తితో సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఐదు అగ్రశ్రేణి దేశాల సరసన భారత్ నిలిచిందన్నారు. పర్యావరణహిత విద్యుత్ వినియోగానికి ప్రోత్సహిస్తూ.. దేశవ్యాప్తంగా 36 కోట్ల ఎల్ఈడీ బల్బులను అందజేశామని ప్రధాని తెలిపారు. దీంతో డిమాండ్ పెరిగి ఉత్పత్తి పెరిగిందని.. తద్వారా ఆరేళ్లలో వాటి ధర పదింతలు తగ్గాయని వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో విద్యుత్ రంగానిది చాలా కీలక భూమిక అని వివరించారు. అభివృద్ధిలో భారత్ కొత్త శిఖరాలకు ఎదుగుతున్న కొద్దీ మన ఆశలు, ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. అదే స్థాయిలో మన చమురు, విద్యుత్ అవసరాలు కూడా పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధించడం చాలా కీలకమన్నారు. రూ. 4,500 కోట్లతో రీవా సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్కులోని మూడు విభాగాల్లో 250 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తి జరగనుంది. ఈ ప్రాజెక్టులో 24 శాతం విద్యుత్‌ను దిల్లీ మెట్రోకు సరఫరా చేయనున్నారు. రెవా సౌర విద్యుత్తు ప్రాజెక్టుతో కేవలం సమీప పరిక్రమలకు విద్యుత్తు అందడమే కాకుండా, ఢిల్లీలోని మెట్రో రైలుకు కూడా విద్యుత్తు సరఫరా జరుగుతుందని మోదీ తెలిపారు. షాజాపూర్, నీముచ్, చాతార్‌పూర్ ప్రాంతాల్లోనూ సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నట్లు మోదీ చెప్పారు. సౌర విద్యుత్తు నేటి తరం కోసం మాత్రమే కాదు అని, 21వ శతాబ్దపు అవసరాలను ఇది తీరుస్తుందన్నారు. సౌర విద్యుత్తు స్వచ్ఛమైంది, భద్రమైందన్నారు.

ఇదిలావుంటే కరోనా సంక్షోభ సమయంలోనూ సౌరవిద్యుత్‌ను ప్రోత్సహిస్తూ భారత్ ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. 2020లో ప్రపంచవ్యాప్తంగా వృద్ధి నమోదు చేసే రంగం కేవలం పునరుత్పాదక ఇంధన రంగమేనని ఆయన అభిప్రాయపడ్డారు. 'క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ సమ్మిట్' పేరిట గురువారం జరిగిన సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కరోనా సంక్షోభం నుంచి కోలుకునే దిశగా ప్రపంచ దేశాలు తయారు చేస్తున్న ప్రణాళికల్లో పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఈ సందర్భంగా ఆయన వాపోయారు. ఈ విషయంలో ఒక్క భారత్ మాత్రమే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. 2050 నాటికి భూమిని కర్బన ఉద్గారాలరహిత గ్రహంగా మార్చాలని పిలుపునిచ్చా

సచివాలయ కూల్చివేతకు తాత్కాలిక బ్రేక్

సోమవారం వరకు ఆపాలన్న హైకోర్టు

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): తెలంగాణ సచివాలయం కూల్చివేత పనులకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బ్రేక్ వేసింది. సోమవారం వరకు పనులు నిలిపివేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. నగరానికి చెందిన సామాజికవేత్త పీఎల్ విశ్వేశ్వర రావు వేసిన పిల్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం తాజా ఆదేశాలిచ్చింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని తెలిపింది. ఇప్పటికే 60శాతం కూల్చివేసినట్టు సమాచారం. అయితే తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని, అప్పటి వరకు యథాతథంగా పనులు జరుగుతాయని సచివాలయ అధికారులు చెబుతున్నారు. ఆదేశాలు అందాక తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. వారం రోజుల క్రితమే కూల్చివేతలకు హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన విషయం తెలిసిందే. గత మంగళవారం కూల్చివేత పనులు ప్రారంభించారు. నాలుగు రోజులుగా నిర్విరామంగా జరుగుతున్న పనులకు హైకోర్టు తాజా ఆదేశాలతో తాత్కాలికంగా బ్రేక్ పడినట్టైంది.

ఎన్‌కౌంటర్‌పై మాజీ సిఎం అనుమానం

రహస్యాలను పాతరేసేందుకు అన్న అఖిలేశ్

సుప్రీం పర్యవేక్షణలో విచారణ జరగాలన్న మాయావతి

లక్నో,జూలై10(ఆర్ఎన్ఎ): యూపీ గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబే ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యూపీ సర్కార్‌ను కాపాడేందుకే .. వికాస్‌ను తీసుకువెళ్తున్న కారును బోల్తా కొట్టించారని ఆ రాష్ట్ర మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. వికాస్‌తో పోలీసులకు ఉన్న సంబంధాలు బయట పడుతాయన్న ఉద్దేశంతో అతన్ని ఎన్‌కౌంటర్ చేశారని అఖిలేశ్ విమర్శించారు. కాన్పూర్‌లో 8 మంది పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమైన తర్వాత.. వికాస్ పరారీలో ఉన్నాడు. అయితే అతను ఉజ్జయిని ఆలయంలో అరెస్టు అయిన తీరు పట్ల కూడా అఖిలేశ్ ప్రశ్నించారు. వికాస్ లొంగిపోయాడా లేక అరెస్టు అయ్యాడా అని అఖిలేశ్ నిన్న తన ట్విట్టర్‌లో నిలదీశారు. ఎన్‌కౌంటర్ జరిగిన తీరును అఖిలేశ్ తప్పుపట్టారు. వికాస్ కారు పల్టీకొట్టేదని, కానీ ప్రభుత్వ రహస్యాలను కాపాడేందుకు ఆ కారు బోల్తాపడినట్లు ఆయన ఆరోపించారు. ఉజ్జయినిలో గ్యాంగ్‌స్టర్ వికాస్ అరెస్టు అయిన తర్వాత అతన్ని చార్టెడ్ ఫ్లయిట్‌లో కాన్పూర్ తీసుకువెళ్లాలని పోలీసులు భావించారు. కానీ ఆ ప్లాన్ మార్చేశారు. సడన్‌గా వికాస్‌ను రోడ్డుమార్గంలో తీసుకువెళ్లడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాన్పూర్‌కు వెళ్తున్న కాన్వాయ్‌లో చాలా వాహనాలు ఉన్నాయి, కానీ వికాస్‌కున్న కారు మాత్రమే ఎలా పల్టీ కొట్టిందని కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. కాన్వాయ్‌ను వెంబడించిన మీడియా వాహనాలను కూడా ఓ చెక్‌పోస్టు వద్ద అకస్మాత్తుగా ఆపేశారు. ఆ తర్వాత కొన్ని గడియల్లోనే వికాశ్ ఎన్‌కౌంటర్ అయినట్లు తేలింది. కరుడగట్టిన నేరచరిత్ర ఉన్న వికాస్‌కు బేడీలు ఎందుకు వేయలేదన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. 8 మంది పోలీసుల్ని హతమార్చిన నేరస్థుడికి ఎందుకు బేడీలు వేయలేదని ప్రశ్నిస్తున్నారు.

సుప్రీం పర్యవేక్షణలో విచారణ చేయాలి: మాయావతి

పోలీస్ ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబే మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు. ఈ కేసుపై సర్వోన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆమె కోరారు. కాన్పూర్‌లో ఎనిమిది మంది పోలీసులను గ్యాంగ్‌స్టర్ బృందం కాల్చిచంపిన క్రమంలో వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా మొత్తం వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని మాయావతి డిమాండ్ చేశారు.

సమగ్ర దర్యాప్తుతోనే పోలీసులు, నేరస్తులు, రాజకీయ నేతలు కుమ్మక్కైన తీరు బయటకువస్తుందని, దోషులకు శిక్ష పడుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలతోనే యూపీ నేరరహిత రాష్ట్రంగా మారుతుందని ఆమె ట్వీట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో గురువారం పట్టుబడ్డ గ్యాంగ్‌స్టర్ వికాస్ దూబేను శుక్రవారం ప్రత్యేక వాహనంలో కాన్పూర్‌కు తరలిస్తుండగా.. పోలీసుల ఎస్కార్ట్‌లోని ఆ వాహనం బోల్తా పడింది. దీనిని అదునుగా తీసుకున్న వికాస్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో గాయపడిన అతడిని కాన్పూర్ ఆస్పత్రికి తరలించగా అతడు మరణించాడు.

జిఎస్టీ బకాయిలను కూడా ఇవ్వండి

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలను కోరిన బుగ్గన

అధికారులతో కలసి కేంద్రమంత్రులతో భేటీ

న్యూఢిల్లీ,జూలై10(ఆర్ఎన్ఎ): విభజన చట్టంలోని అభివృద్ధి పథకాలకు నిధులు, పీడీఎస్, జీఎస్టీ బకాయిల మంజూరు చేయాలని ఎపి ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ భేటీ పుక్రవారం అయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ జరిపారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డితో మంత్రి భేటీ అయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో భేటీ అనంతరం బుగ్గన రాజేంద్రనాథ్ మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రాష్ట్రానికి చేయూత ఇచ్చేందుకు అదనంగా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై ముఖ్యమంత్రి ఇచ్చిన వివరణలు కేంద్రానికి ఇచ్చాం. 3,500 కోట్ల రూపాయల రీయంబర్స్‌మెంట్ చేయాల్సి ఉంది. పోలవరం త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఖర్చుపెట్టి రీయంబర్స్‌మెంట్ అడుగుతోంది. కోవిడ్ కారణంగా నిధుల విడుదలలో కొంత ఆలస్యం ఉంది. విభజన చట్టం ప్రకారం రెవెన్యూ లోటు నిధులతో కొత్త ప్రాజెక్టులకు ఉపయోగిస్తాం. జీఎస్టీ బకాయిలు 3500 కోట్లు రావాలని బుగ్గన తెలిపారు. ఏప్రిల్, మే,జూన్‌లో రాష్ట్రానికి 40 శాతం ఆదాయం పడిపోయిందని, కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలిసి పోలవరం నిధులను విడుదల చేయాలని అడుగుతామని మంత్రి బుగ్గన చెప్పారు. గత ప్రభుత్వం ప్రత్యేక హోదాను వదిలిపెట్టి ప్యాకేజీకి మార్చుకుంది. ప్యాకేజీలో స్పష్టత లేక ఈఏపీ నిధులు అంటూ అయోమయాన్ని సృష్టించింది. నిజానికి ఈఏపీ అనేది రెగ్యులర్‌గా జరిగే పక్రియ నూతన పథకాలకు కేంద్రం నుంచి గ్రాంట్లు, రెవెన్యూ లోటు నిధులు, కేంద్ర ఆర్థిక సంస్థ నుంచి అప్పుల ద్వారా నిధులను సేకరిస్తాం. క్యాపిటల్ వర్క్ కోసం అప్పులు చేయక తప్పదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు.బుగ్గన వెంట ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ్ కల్లం, ఆర్థిక శాఖ కార్యదర్శి రావత్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉన్నారు.

భద్రాత దళాల చీఫ్‌లతో రాజ్‌నాథ్ భేటీ

-సరిహద్దు సమస్యలపై లోతుగా చర్చ

న్యూఢిల్లీ,జూలై10(ఆర్ఎన్ఎ): ఈస్టర్న్ లడఖ్‌లో ఉన్న పరిస్థితిపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమగ్ర స్థాయిలో సమీక్ష జరిపారు. సైనిక ఉన్నతాధికారులతో ఆయన భేటీ నిర్వహించారు. వివాదాస్పద ప్రాంతం నుంచి చైనా దళాలు ఉపసంహరించిన అంశం గురించి అడిగి తెలుసుకున్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణెళి, నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ భదౌరియాలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గాల్వన్ లోయ నుంచి దళాల ఉపసంహరణకు సంబంధించి జనరల్ నరవాణెళి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సవివరంగా విషయాలను వెల్లడించారు. గోగ్రా, హాట్ స్పిం÷-రగ్స్, ఫింగర్ 4, పాన్‌గాంగ్ సో లాంటి కీలక ప్రాంతాల నుంచి కూడా దళాలు వెనక్కి వెళ్లినట్లు జనరల్ నరవాణెళి తెలిపారు. గాల్వన్ లోయలో మూడు కిలోమీటర్ల మేర బఫర్ జోన్‌ను క్రియేట్ చేసినట్లు తెలుస్తోంది. ం

కాశ్మీర్‌లో మరో ఉగ్రవాది అరెస్ట్

సరిహద్దుల్లో పాక్ కాల్పుల ఉల్లంఘన..జవాన్ మృతి

శ్రీనగర్,జూలై10(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ లోని బందీపొరాలో లష్కరే తోయిబా ఉగ్రవాదిని పోలీసులు అరెస్టు చేశారు. ఉగ్రవాది నుంచి భారీగా గ్రెనేడ్లు, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. హజిన్ పట్టణంలో విధ్వంసక చర్యలకు పాల్పడేందుకు ఉగ్రవాదులు కుట్రలు చేస్తున్నట్లు బలగాలకు పక్కా సమాచారం అందింది.

దీంతో పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు కలిసి అక్కడ కూంబింగ్ నిర్వహించారు.

కూంబింగ్ లో భాగంగా రఫీక్ అహ్మద్ అనే ఉగ్రవాది పట్టుబడ్డాడు. పోలీసు భవనాలపై గ్రెనేడ్లతో దాడి చేసేందుకు ఉగ్రవాది సిద్ధమవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఉగ్రవాది నుంచి 2 లైవ్ గ్రెనేడ్లు, ఏకే 47కు సంబంధించి 19 లైవ్ రౌండ్ల బుల్లెట్లతో పాటు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రఫీక్ ఇటీవలే లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలో చేరాడు. హజిన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలావుంటే భారతసరిహద్దుల్లో పాకిస్థాన్ మరోమారు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది.

భారత బలగాలే లక్ష్యంగా కాల్పులకు పాల్పడింది. జమ్ములోని రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లోశుక్రవారం ఉదయం పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఆర్మీ జవాన్ మృతిచెందారు. సరిహద్దు వెంట పాక్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో హవిల్దార్ సంబూర్ గురుంగ్ తీవ్రంగా గాయపడ్డారు. దవాఖానకు తరలించేలోపు జవాన్ మృతిచెందారని లెఫ్టినెంట్ కర్నల్ దేవేందర్ ఆనంద్ వెల్లడించారు.

తీన్మార్ మల్లన్నకు హైకోర్టులో చుక్కెదురు

కెసిఆర్ ఆరోగ్యంపై వేసిన పిటిషన్ తిరస్కరణ

పొలిటికల్ జిమ్మిక్కులపై ఆగ్రహం

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలపాలంటూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారిం చలేమంటూ తేల్చి చెప్పింది. పొలిటికల్ జిమ్మిక్కులు చేస్తే ఊరుకునేది లేదని పిటిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం తీవ్ర స్వరంతో హెచ్చరించింది. ముఖ్యమంత్రి కనిపించకపోతే హెబియస్ కార్ప్ దాఖలు చేసుకోవాలని పిటిషనర్‌కు హైకోర్టు సూచించింది. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారించలేమని స్పష్టం చేసింది. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలపాలంటూ తీన్మార్ మల్లన్న హైకో ర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొంత కాలం గా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కనిపించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన ఆరో గ్య పరిస్థితిపై రకరకాల వుకార్లు వస్తున్నా యని, దీంతో కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ప్రజలు ఆందోళ చెందుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఆరోగ్య పరిస్

నేటినిజం
శనివారం 11-7-2020

విమర్శలు కాదు...వివేచన చేయాలి !

తెలంగాణలో మాత్రమే కాదు దేశవ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ కరోనా విజృంభిస్తోంది. కరోనాకు బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ అన్న తేడా లేకుండా విజృంభిస్తోంది. అన్ని రాష్ట్రాల్లోనూ ఆయా ప్రభుత్వాలు ఎవరికి వారు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కరోనాకు మందు లేని కారణంగా ఫలానా వైద్యం చేయలేదన్న పరిస్థితి లేదు. ఇక భారతదేశంలో కరోనా కట్టడిపై ప్రభుత్వ వైఫల్యం మీద అసంతృప్తి గట్టిగా రగులుతున్న విషయం వాస్తవమే. అన్న రాష్ట్రాలతో పాటు కేంద్రంపైనా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణకు సంబంధించినంత వరకు ఇక్కడ విపక్షాలు కాస్తా ఎక్కువగా దృష్టి సారించారు. అయితే వారి దృష్టి అంతా విమర్శలపైనే ఉంది తప్ప ప్రజలపై లేదనే చెప్పాలి. గాంధీ ఆస్పత్రి లేదా ప్రైవేట్ ఆస్పత్రుల్లో అక్రమాలు జరిగితేనే, సరిగా వైద్యం అందకపోతేనో మంత్రి ఈటెల రాజేందర్ లేదా కెటిఆర్‌లను కలుసుకుని చర్చించ వచ్చు. ఉమ్మడిగా వెళ్లి సమస్యలను ప్రాస్తావించవచ్చు. అంతేగానీ సిఎం కెసిఆర్ కనిపించడం లేదని చెప్పడం సరికాదు. సమస్యను పట్టుకుని దానిని పరిష్కరించేందుకు యత్నించిన దాఖలాలు లేవు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా కట్టడి విషయంలో పాలకులంతా దేవుడి మీదనే భారం వేసినట్టు కనిపిస్తున్నది. వ్యాక్సిన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఏవో కొన్ని సమన్వయ చర్యలు తప్ప చేయగలిగేది కూడా ఏమీ ఉన్నట్టు కనిపించడం లేదు. కానీ ప్రాణభయం ఉండవలసిన ప్రజలు అత్యధికులు, ఏమి జరిగితే అది జరుగుతుందిలే అన్న తెగింపుతో నిర్లక్ష్యంగా కదులుతున్నారు. కారుచిచ్చు లాగా రోజురోజుకూ వ్యాధి వ్యాపిస్తుంటే కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇది సిఎం కెసిఆర్ లేద ప్రధాని మోడీ వచ్చి మాస్కులు కట్టరు. శానిటైజర్ రాయరు.

ఇన్నాళ్లూ లాక్‌డౌన్ విధించి జాగ్రత్తలు చెప్పినా జనానికి అర్థం కావడం లేదు. ఇటువంటి పరిస్థితిలో ఏ ప్రభుత్వం మాత్రం ఏమీ చేయజాలదు. కరోనా వ్యాప్తి తీవ్రత గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించ వద్దని ఎవరూ అనడం లేదు. కేవలం విమర్శలు చేస్తూ పోతే నష్టపోయేది ప్రజలు మాత్రమే అన్న విషయాన్ఇన గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయపార్టీలు అందరూ రాజకీయాలలో మునిగి తేలుతున్నారు తప్ప, సమస్య వైపు చూడడం లేదు. జాగ్రత్తలూ పాటించడం లేదు. ప్రభుత్వం సరిగ్గా చేయడం లేదని ఆస్పత్రుల ముందు ధర్నాలూ, భీకర ప్రకటనలూ చేసే పక్షాల వారు కూడా, ప్రభుత్వాలకు సూచనలు చేయడం లేదు. తాము స్వయంగా మంత్రులనో అధికారులనో కలసి పరిస్థితి వివరించి చక్కదిద్దే ప్రయత్నం చేయవచ్చు. పరీక్షలు తగినన్ని చేయడం లేదని అనేక వర్గాల నుంచి పదేపదే విమర్శలు వచ్చినమీదట, 50వేల పరీక్షలు ఒక పదిరోజుల కాలంలో చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరీక్షలు కూడా ఎవరికి పడితే వారికి చేసేవి కావు. వ్యాధి సోకినవారి కుటుంబసభ్యులు, సన్నిహితులు, వారికి సమీపంగా మెలగినవారు, కరోనా విపత్తులో ముందుండి పనిచేస్తున్న వైద్యసిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు, సంఘసేవకులు– వీరికి మాత్రమే జరుగుతున్నాయి. పరీక్షలు జరిపినవారిలో 27 శాతం మందికి వ్యాధినిర్ధారణ జరుగుతున్నదంటే, తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్టే. దీనిపై ఒక నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయకపోతే ఏం జరుగుతుందో ఇప్పుడు హైదరాబాద్‌లో అదే జరుగుతోంది. ఇప్పుడు పరిస్థితి చేజారేలా ఉంది. ఇప్పుడు జంటనగరాలలో ఏవి కంటెయిన్మెంట్ ప్రాంతాలు, ఏవి కావు అన్న తేడా లేకుండా పోయింది. హైదరాబాద్, విజయవాడ, ముంబయి, అహ్మదాబాద్, ఢిల్లీ... ముప్పు ఉన్న ప్రతిచోటా ప్రమాదసూచిక ఎగురవేయాలి. మరోవైపు కరోనా రోగులు పెరుగుతున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా అనుమానితులు, నిర్ధారణ అయిన వారి చికిత్సలను ఆరోగ్య శ్రీలో చేర్చింది. కరోనా చికిత్సకు అయ్యే

ఖర్చుల వివరాలను కూడా ప్రకటించారు. ప్రైవేటు ఆస్పత్రులు ఆయా ఫీజులకు మించి వసూలు చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులన్నీ ఇవే ఫీజులు వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద ట్రీట్మెంట్ పొందిన వారికి రీయింబర్స్ చేయనున్నట్లు తెలిపారు. పేద ప్రజలెవరైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడైనా ఉచితంగా కరోనా చికిత్స పొందవచ్చన్నారు. ఇకపోతే దేశంలో కరోనా రోగుల రికవరీ రేటు 62 శాతానికి పెరిగిందని కేంద్రం తెలిపింది. కరోనాతో చనిపోయిన వారిలో 11 శాతం మంది 30 నుంచి 44 ఏళ్ల వయసు వారేనని కరోనాతో చనిపోయిన వారిలో 32 శాతం మంది 45–59 ఏళ్ల వారు, కరోనాతో చనిపోయిన వారిలో 39 శాతం మంది 60 నుంచి 70 శాతం మధ్య వయసున్న వారు ఉన్నారు. ప్రపంచంలో ఇతర దేశాలతో పోల్చితే , మిలియన్ జనాభాకు కేసులు భారతదేశంలో నమోదు అవుతున్న కేసులు అతి తక్కువని కేంద్రం పేర్కొన్నది. భారతదేశంలో మిలియన్ జనాభాకు మరణాల రేటు ప్రపంచంలోనే అత్యల్పంగా ఉందని అన్నారు, దేశంలో కరోనా వైరస్ పరీక్షల సామర్థ్యం పెంచడానికి, వేగవంతం చేయడానికి, ప్రైవేట్ ల్యాబ్‌లు క్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నామని అన్నారు. దేశీయంగా రెండు వ్యాక్సిన్ల సామర్థ్యం పై చాలా వేగంగా ప్రయోగాలు జరుగుతున్నాయి. వ్యాక్సిన్ రావడానికి రెండేళ్లు పడుతుందని ప్రపంచ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో మనమంతా జాగ్రత్తగా ఉండడం, రాజకయీ పార్టీల వారు క్షేత్రస్థాయిలో వెళ్ళి ప్రజలను చైతన్యం చేయడం ముఖ్యం.

రోజా గన్‌మెన్‌కు కరోనా

తిరుపతి స్విమ్స్‌లో చికిత్సకు చేరిక

తిరుపతి,జూలై10(ఆర్ఎన్ఎ): ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల్లో కరోనా టెన్షన్ రేపుతోంది. భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సిబ్బంది కరోనా బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. తాజగా ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్, నగరి ఎమ్మెల్యే రోజా గన్‌మెన్ కూడా కరోనా బారినపడ్డారు. తిరుపతిలోని స్విమ్స్‌కు ఆయన్ను తరలించి చికిత్స అందిస్తున్నారు. రోజా గన్‌మెన్‌కు కరోనా పాజిటివ్ రావడం.. ఆమె ఇటీవల మాస్క్ లేకుండా పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో.. వైసీపీ కార్యకర్తలు ఆందోళన నెలకొంది. ఐతే తన ఆరోగ్యంపై ఆందోళన చెందల్సిన అవసరం లేదని.. కరోనా బారినపడిన తన గన్‌మెన్ సెలవులో ఉన్నాడని రోజా తెలిపారు. 18 రోజులుగా విధులుగా రావడం లేదని చెప్పారు.ఏపీలో ఇప్పటి వరకు 23,814 కరోనా యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో కరోనా మహమ్మారితో పోరాడుతూ 12,154 మంది కోలుకొని డిశ్చార్జి కాగా.. ఇప్పటి వరకు 277 మంది చనిపోయారు. ప్రస్తుతం ఏపీలో 11,383 కరోనా యాక్టివ్ కేసులున్నాయి. ఇక టెస్ట్‌ల విషయానికి వస్తే.. గడిచిన 24 గంటల్లో 16,882 శాంపిల్స్‌ను పరీక్షించగా 1,500 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇక గురువారం వరకు 10,94,615 కరోనా పరీక్షలు చేసినట్లు ఏపీ వైద్యఆరోగ్యశాఖ తెలిపింది.

జింకను చంపిన ఆరుగురు వ్యక్తుల అరెస్ట్

భద్రాద్రికొత్తగూడెం,జూలై10(ఆర్ఎన్ఎ): అశ్వారావుపేట మండలం మద్దికొండ గ్రామంలోకి అడవి నుంచి వచ్చిన ఓ జింకను శుక్రవారం తెల్లవారుజామున కొంతమంది గ్రామస్థులు పట్టుకున్నారు. ఓ ఇంటిలో బంధించి చంపేశారు. దాని మాంసం, చర్మాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. ఇన్‌ఛార్జి రేంజర్ రెహ్మాన్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది వారిని పట్టుకున్నారు. దీనికి కారణమైన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారిపై వణ్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి రేంజర్ తెలిపారు.

రైతుల సంక్షేమం కోసమే వేదికల నిర్మాణం

–సాగర్‌లో రైతువేదిక శంకుస్థాపనలో మంత్రి

నల్లగొండ,జూలై10(ఆర్ఎన్ఎ): వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకే ప్రభుత్వం రైతువేదికలను నిర్మిస్తున్నదని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రైతువేదికల నిర్మాణాలు దేశానికే తలమానికమని, గిట్టుబాటు ధర నిర్ణయించేందుకు రైతువేదికలు తొలి అడుగని ప్రకటించారు. ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, కిశోర్, భూపాల్‌రెడ్డితో కలిసి నాగార్జున సాగర్ నియోజకవర్గంలో రైతు వేదికల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనేదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. క్లస్టర్ పరిధిలోని రైతాంగాన్ని ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి వారిని సంఘటితం చేయవచ్చన్నారు. రైతువేదికల ద్వారా ఏ పంటలకు ఏయే భూములు అనువైనవో రైతుల్లో అవగాహన పెంపొందించవచ్చని తెలిపారు. భూసారం, పోషకాల చర్చకు ఇవి తోడ్పడుతాయాని చెప్పారు. సీఎం కేసీఆర్ దార్శనికతకు రైతువేదికలు నిదర్శనమన్నారు. హరితహారంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితహారాన్ని పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. ప్రకృతిని కాపాడుకుంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. రేపటి తరాలకు క్షామాలు రాకుండా ఉండాలంటే విరివిగా మొక్కలు నాటడం మన కర్తవ్యమన్నారు.

పరిపాలనా రాజధానిగా విశాఖకు అన్ని హంగులు

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి అవంతి

విశాఖపట్నం,జూలై10(ఆర్ఎన్ఎ): పరిపాలనా రాజధానిగా విశాఖ నగరానికి అన్ని హంగులు సమకూర్చ బోతున్నామని పర్యాటక శాఖా మంత్రి అవంతి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన భీమిలి నియోజకవర్గంలోని మధురవాడ ప్రాంతంలో రూ. 4.5 కోట్ల అభివృద్ధి పనులకి శంఖుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ, పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ఏడాది విశాఖ నగరంలో రూ. 1000 కోట్ల పైన అభివృద్ధి పనులకి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఒక్క భీమిలి నియోజకవర్గంలోనే 17 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రూ. 4.5 కోట్లతో మధురవాడ ప్రాంతంలో అభివృద్ధి పనులకి శంఖుస్థాపనలు చేశాం. విశాఖ నగరంలో మౌలిక వసతులపై దృష్టి పెట్టాం. అభివృద్ధి చెందడానికి విశాఖ నగరానికి అన్ని అర్హతలు ఉన్నాయి. . రాబోయే రోజులలో విశాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. విశాఖ నగరం 2019 కి ముందు...ఆ తర్వాత అన్న తేడాలను ప్రజలు స్పష్టంగా గుర్తిస్తారు. ఎయిర్ పోర్టు, మూడు పోర్టులు, రైల్వే డివిజన్...ఇలా అన్ని వసతులు ఉన్న నగరం విశాఖ పట్నం. అంతర్జాతీయ నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని మంత్రి అవంతి వివరించారు.

పోలీసులకు కునుకు లేకుండా చేస్తోన్న కరోనా

ముంబై,జూలై10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో కరోనా విలయతాండవం చేస్తోంది. ఆ రాష్ట్ర పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.గడిచిన 48 గంటల్లో 222 మంది పోలీసులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ముగ్గురు పోలీసులు కరోనాతో ప్రాణాలు విడిచారు. మహారాష్ట్ర వ్యాప్తంగా 5,935 మంది పోలీసులకు కరోనా సోకింది. ఇప్పటి వరకు 74 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు.

మహారాష్ట్రలో ఇప్పటి వరకు 2,30,599 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, 9,667 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం పాజిటివ్ కేసుల్లో 93,654 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. కరోనా నుంచి 1,27,259మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు.

సమగ్ర వ్యవసాయ విధానంతో ముందుకు సాగాలి

కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి
దుగుమతులపై ఆంక్షలు విధించాలి

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయరంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇద్దరు సిఎంలు కూడా వ్యవసాయాన్ఇన తమ ఎజెండాలో ప్రాధాన్యం కల్పించారు. తెలంగాణలో నియంత్రిత సాగు చేసేందుకు రైతు ముందుకు వచ్చారు. అయితే ఎప్పిటాగానే నకిలీ విత్తానలు రైతులను నిండా ముంచేస్తున్నాయి. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న దళారీలు విత్తనాలను ఇష్టం వచ్చినట్లుగా అమ్ముతున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు.

రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమాను లకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయభూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. స్వాతంత్ర్యం లభించి 70సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జటిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభి స్తూనే ఉన్నాయి. రైతులను దోచుకుంటున్న వారికి తిండి ఎలా వంటబడుతుందో అర్థం కావడం లేదు. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ కూడా తన వాగ్దానాన్ని నెరవేర్చుకోలేదు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. రైతులకు పెట్టబడతో పాటు రాయితీ విత్తనాలు,ఎరువులు అందుతున్నాయి. అలాగే బీమా సౌకర్యం రాబోతున్నది. ఇకపోతే 24 గంటల ఉచిత కరెంట్ అందుతోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి. అంతేగాకుండా బలవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఇవన్నీ జాతీయస్థాయిలో జరగాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలుకూడా తెలంగాణ తరహాలో చొరవ తీసుకోవాలి.

హరితహారం పౌరుల బాధ్యత

అందరూ కలస్తేనే పచ్చదనం సాధ్యం : కలెక్టర్

ఆదిలాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): హరితహారం ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని కలెక్టర్ శ్రీదేవసేన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రబుత్వంతో కలసి రావాలని అన్నారు. జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. మూడు ఫీట్లకు పైగా ఉన్న మొక్కలను మాత్రమే నాటాలన్నారు. హరితహారం నిరంతర పక్రియ అని చెప్పారు. ప్రతి ప్రభుత్వ సంస్థల్లో వందశాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యాచరణ రూపొందించాలనీ, హరితవనాల కోసం స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలని, సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటాలన్నారు. నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలన్నారు. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టామని తెలిపారు. వీటిని ప్రజలు కూడా ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ ఏడాది ఎక్కువ హరిత వనాల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు, వీలైనన్ని చోట్ల అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పండ్ల మొక్కల్లో అడవి మామిడి పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, కూలీలను హరితమిత్ర అవార్డుకు నామినేట్ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇకపోతే కోతులను నిరోదించేందుకు మంకీఫుడ్ కోర్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు.

లక్ష్యం మేరకు హరితహారం

ఊరూవాడా సాగుతున్న కార్యక్రమం

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): హరితహారంలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగుతున్నారు. సిఎం కెసిఆర్ మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆరో విడత హరితహారం కార్యక్రమం ప్రారంభించన తరవాత జిల్లాల్లో జోరుగా కార్యక్రామలు సాగుతున్నాయి. వర్షాలు కూడా సకాలంలో పడడంతో మొక్కల పెంపకానికి అనువైన వాతావరణం ఏర్పడింది. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. వీటిని జులై మాసంలో గ్రామాల వారీగా పంపిణీ చేసి, అందరిచేత మొక్కలు నాటించేందుకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశాభావంతో ఆరో విడత హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపడుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచుతున్నారు.

ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలిస్తున్నారు. ఎక్కడికక్డ మొక్కలను పెంచేలా మంత్రలు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తున్నారు. ఊరూవాడా జోరుగా ఈ కార్యక్రమం సాగుతోంది.

నిజామాబాద్‌లో ఒకేసారి నలుగురు కరోనా మృతులు

ఆక్సిన్ అందకు మృతి చెందాడంటూ బంధువుల ఆందోళన
రంగంలోకి దిగి ఆరా తీస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

నిజామాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): కరోనాతో ఒకేసారి నలుగురు వ్యక్తులు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కలకలం సృష్టిస్తోంది. ఒకరు ఆక్సిజన్ అందక మృతిచెందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరో ముగ్గురు కరోనా కారణంగానే చనిపోయారని అంటున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే అతడు చనిపోయారని మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు.

నిజామాబాద్ జిల్లాలో ఇప్పటివరకు కరోనా కారణంగా 9 మంది మృతి చెందారు. అయితే ఒకేసారి నలుగురు చనిపోవడంతో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై పలు అనుమానులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ నారాయణ రెడ్డి సందర్శించారు. నలుగురు కరోనా బాధితులు ఒకేసారి ఎలా చనిపోయారన్న దానిపై వివరాలు ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. నిందితులను శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులతో ఆసుపత్రి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తమిళనాడులో కరోనాపై కేంద్ర బృందంతో సీఎం సమీక్ష

చెన్నై, జులై 10: తమిళనాడు రాష్ట్రంలో కరోనా రోజురోజుకూ విస్తరిస్తుండడంతో పరిస్థితిపై చర్చించేందుకు శుక్రవారం చెన్నైలో కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఆర్తీ అహుజా నేతృత్వంలో ఆ రాష్ట్ర సీఎం యడప్పాడి పళనిస్వామి కేంద్ర బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కరోనా మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్రం బృందం సీఎంతో సమీక్షించింది. రాష్ట్ర రాజధాని చెన్నైలో అధికంగా కేసులు నమోదవుతుండడానికి గల కారణాలు అడిగి తెలుసుకుంది. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, ఆరోగ్యశాఖ మంత్రి విజయభాస్కర్, ఆరోగ్యశాఖ కార్యదర్శి రామకృష్ణన్‌తోపాటు సీనియర్ అధికారులతో కేంద్రం బృందం సభ్యులు సమావేశమయ్యారు. దేశంలో మహారాష్ట్ర తరువాత అత్యధిక కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నది తమిళనాడు రాష్ట్రంలోనే. ఇప్పటివరకు ఆ రాష్ట్రం

ఐపిఎల్‌పై మళ్లీ చిగురిస్తున్న ఆశలు

-గంగూలీ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఉత్కంఠ

కోల్‌కతా,జూలై10(ఆర్ఎన్ఎ): ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎప్పుడు.. ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు తాజాగా సౌరభ్ గంగూలీ చేసిన వ్యాఖ్యలే బలాన్ని చేకూర్చాయి. ఐపీఎల్ నిర్వహించడమే ఇప్పుడు తనకున్న మెదటి కర్తవ్యమన్నారు. ఐపీఎల్ లేకుండా ఈ ఏడాది ముగిసిపోవడం తనకు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. ఏమాత్రం అవకాశం దొరికినా లీగ్ నిర్వహిస్తామన్నారు. ఐపీఎల్ నిర్వహించాలని గంగూలీ గట్టి పట్టుదలతో ఉండడంతో అభిమానులలో ఆశలు చిగురించాయి. 2020 ఐపీఎల్ లేకుండానే ముగుస్తోందా.. అనుకున్నప్పటికి దాదా వాఖ్యలతో ఈవెంట్ జరుతుందనే నమ్మకం అభిమానుల్లో పెరిగింది. ఐసీసీ టి20 వరల్డ్‌కప్ భవితవ్యాన్ని బట్టి ఐపీఎల్ తేదీలు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. అయితే తాజా పరిణామాలను చూస్తే టీ20 వరల్డ్‌కప్ జరగడం కష్టమే అనిపిస్తోంది. కరోనా విజృంభణ ఏమాత్రం తగ్గకపోవడంతో వరల్డ్‌కప్‌ను ఐసీసీ రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సాధ్యమైనంత వరకు భారత్‌లోనే ఐపీఎల్ నిర్వహించాలని బీసీసీఐ చూస్తోంది. ఒక్కవేళ భారత్‌లో పరిస్థితులు అనకూలించకపోతే లీగ్‌ను విదేశాల్లో నిర్వహించే ఆలోచనలో బోర్డు ఉంది. ఇండియాలో ఐపీఎల్ నిర్వహించడమే తనకు మొట్టమొదటి ప్రాధాన్యతాంశమని గంగూలీ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఈ మెగా ఈవెంట్ భారత్‌లోనే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ ఎప్పుడనేది మాత్రం స్పష్టత లేదు.

కోవిడ్-19 మీద డాక్టర్ హర్షవర్ధన్ నేతృత్వంలో మంత్రుల బృందం సమావేశం

హైదరాబాద్,జులై10:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ హర్ష వర్ధన్ నేతృత్వంలో కోవిడ్ మీద మంత్రుల బృందం 18వ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ రోజు జరిగింది. ఆయనతోబాటు విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్, పౌర విమానయాన శాఖామంత్రి శ్రీ హర్ దీప్ ఎస్. పూరి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్విన్ కుమార్ చౌబే, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ మాన్ సుఖ్ మాండవ్యా, నీతి ఆయోగ్ ఆరోగ్య విభాగం సభ్యుడు శ్రీ వినొద్ పౌల్ కూడా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దేశంలో ప్రస్తుతం నెలకొన్న కోవిడ్ పరిస్థితిని మంత్రులకు వివరించారు. ప్రపంచ స్థాయిలో అత్యధికంగా ప్రభావితమైన మొదటి ఐదు దేసాల స్థితితో పోల్చి చూశారు. ఇందులో భారతదేశంలో ప్రతి పది లక్షలకు కేసుల సంఖ్య 538 గాను, మరణాల సంఖ్య కూడా ప్రతి పది లక్షలకు 15 చొప్పున అతి తక్కువగాను నమోదైనట్టు గుర్తించారు. అంతర్జాతీయంగా కేసుల సంఖ్య 1453. మరణాల సంఖ్య 68.7 ఉన్నట్టు తెలుసుకున్నారు. దేశం లోపల ఎనిమిది రాష్ట్రాల్లో (మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్) మొత్తం 90% కేసులు చికిత్సలో ఉన్నట్టు, అందులో కేవలం 49 జిల్లాల్లోనే 80% కేసులు చికిత్సలో ఉన్నట్టు గుర్తించారు. మొత్తం మరణాల సంఖ్య దృష్ట్యా చూస్తే 80% మరణాలు ఆరు రాష్ట్రాల (మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్) లో సంభవించినట్టు లెక్కలు చూపుతున్నాయి. జిల్లాల పరంగా చూస్తే 32 జిల్లాల్లోనే 80% మరణాలు నమోదయ్యాయి. ఎక్కువ మరణాలు నమోదవుతున్న ప్రాంతాలలో ప్రత్యేక కృషి జరుగుతున్నట్టు మంత్రుల బృందానికి తెలియజేశారు.

దేశంలో కోవిడ్ సంబంధమైన ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల గురించి మాట్లాడుతూ ఈ రోజు వరకూ దేశంలో ఉన్న పరిస్థితిని కూడా మంత్రులకు తెలియజేశారు. మొత్తం 3914 ఆస్పత్రులలో చికిత్స జరుగుతుండగా వాటిలో ఐసియు సౌకర్యం లేని 3,77,737 ఐసొలేషన్ పడకలు, 39,820 ఐసొలేషన్ పడకలు, 1,42,415 ఆక్సిజెన్ తో కూడిన పడకలు, 20,047 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

సామగ్రి విషయానికొస్తే 213.55 లక్షల ఎన్95 మాస్కులు, 120.94 లక్షల పిపిఇ లు, 612.57 లక్షల హెచ్ సి క్యు మాత్రలు పంపిణీ చేశారు.

లాక్ డౌన్ నిబంధనల సడలింపు మొదలయ్యాక కంటెయిన్మెంట్ జోన్ల లో నిఘా మీద ప్రత్యేక దృష్టి సారించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆ ప్రాంతాలను ప్రత్యేకంగా విభజించటం, వాటి వివరాలను వెబ్ సైట్ లో ప్రకటించటం, పరిసరాలమీద గట్టి నిఘా పెట్టటం, కేవలం నిత్యావసరాలకు మాత్రమే అనుమతించటం, వైరస్ సోకే అవకాశం ఉన్నవాళ్ల ఆచూకీ తెలుసుకోవటం, ఇంటింటికీ తనిఖీలు జరపటం, కంటెయిన్మెంట్ జోన్ల కాని చోట్లలో బఫర్ జోన్లు గుర్తించటం తద్వారా, వైరస్ సోకే అవకాశమున్న వారిని గుర్తించటం లాంటి చర్యలు చేపట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో అనేక చర్యలు చేపట్టిన విషయం కూడా మంత్రుల బృందం దృష్టికి వచ్చింది. ప్రజారోగ్య నిపుణులతో కూడిన కేంద్ర బృందాలు అనేక రాష్ట్రాలను సందర్శించటం, రాష్ట్రాలకు అవసరమైన సలహాలిస్తూ మార్గదర్శనం చేయటం , తద్వారా వ్యాధి విస్తరణను నియంత్రించటం లాంటి చర్యలు చేపట్టిన తీరును తెలియజేశారు. కాబినెట్ సెక్రటరీ ఎప్పటికప్పుడు బాగా ప్రభావితమైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులతో వీడియో కాన్ఫరెన్సులు జరపటం, పరీక్షల సంఖ్య పెంచేలా చూడటం, మరణాలు తగ్గేందుకు కృషి చేయటం లాంటి అంశాలను కూడా మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళారు.

డాక్టర్ హర్ష వర్ధన్ మాట్లాడుతూ, " మనం ముందుకెళ్ళేకొద్దీ, వ్యాధి నియంత్రణమీద ప్రత్యేకంగా దృష్టిపెట్టటం, నిఘా పెంచటం, పూర్తి స్థాయి పరీక్షల సామర్థ్యాన్ని వాడుకోవటం, వృద్ధులలో దీర్ఘకాలిక వ్యాధులున్నవారిమీద ఒక కన్నేసి ఉంచటం, ఆరోగ్య సేతు లాంటి యాప్స్ సాయంతో రాబోయే హాట్ స్పాట్స్ ఏవో ముందుగా గుర్తించగలగటం రోగులను చేర్చుకోవటంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడటం, పడకలు, ఆక్సిజెన్, వెంటిలేటర్లు, ఇతర పరికరాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించటం మీదనే పనిచేస్తున్నాం" అన్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకారంతో మరణాల రేటును వీలైనంత తక్కువ స్థాయిలో ఉంచటం, ఆరంభ దశలోనే బాధితులను గుర్తించటం. చికిత్స అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

వ్యాధి నియంత్రణ జాతీయ కేంద్రం (ఎన్ సి డి సి) డైరెక్టర్ డాక్టర్ సుజీత్ కె సింగ్ ఈ సంక్షోభం కాలంలో చేపట్టిన నిఘా కార్యకలాపాలను సవివరంగా తెలియజేశారు. శ్వాస సంబంధమైన వ్యాధులున్నవారిని గుర్తించటం మీద వారికి నయం చేయటం మీద ప్రధానంగా దృష్టిపెట్టామన్నారు. సీరమ్ సేకరణ ద్వారా సర్వే చేయటం, దేశ వ్యాప్తంగా లాబ్ ల సంఖ్య పెంచి పరీక్షల సంఖ్య పెంచటం తగిన ఫలితాలనిచ్చిందన్నారు. ఎక్కువగా ప్రబలిన చోట్ల మరింత ఎక్కువగా పనిచేసి సకాలంలో వైద్య సేవలు అందేలా చూదగలిగామని అధిక రిస్క్ ఉందనుకున్న దీర్ఘకాల వ్యాధిగ్రస్తులపట్ల అప్రమత్తంగా వ్యవహరించామని చెప్పారు. ఆ విధంగా మరణాల శాతం తగ్గించగలిగామన్నారు.

ఎంపవర్డ్ గ్రూప్ చైర్మన్ శ్రీ అమిత్ ఖారే మంత్రుల బృందానికి వివరంగా అన్ని చర్యలనూ వివరించటంతో బాటు వారి ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సమాచార వ్యాప్తిలోను, ప్రజలకు అవగాహన కల్పించటంలోను ఎంతో జాగ్రత్తగా వ్యవహరించినట్టు వివరించారు. మొత్తం 6,755 అబద్ధపు వార్తలకు గాను 5,890 విషయంలో సమాధానాలిచ్చామని, 17 విదేశీ మీడియా వార్తాకథనాలకు స్పందించి జవాబివ్వగా ప్రచురించాయని చెప్పారు. రోజువారీ కోవిడ్ బులెటిన్స్ 98 జారీచేయటాన్ని, 92 మీడియా సమావేశాలు నిర్వహించగా 2,482 పత్రికా ప్రకటనలు జారీచేయటాన్ని ప్రస్తావించారు. ఈ సంక్షోభ కాలంలో ప్రజల అవగాహన పెంచి వారి ప్రవర్తనను సరిదిద్దటంలో సమర్థంగా పనిచేసినట్టు తెలియజేశారు. అదే విధంగా రైతులకు, సూక్ష్మ, చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలకోసం ప్రధాని ప్రకటించిన ఆత్మ నిర్భర భారత్ అభియాన్ లోని రాయితీలను వివరించటంలో కూడా తగిన పాత్ర పోషించామన్నారు. కోవిడ్ కారణంగా తలెత్తిన అనేక మానసిక సమస్యలమీద మీడియాలో కథనాలు వస్తున్న సమయంలో ఒక ప్రత్యేక వ్యూహం ద్వారా ప్రాంతీయ భాషల్లో తగిన సమాచారం అందిస్తూ వీలైనంత మందిని చేరుకోగలిగామన్నారు.

ఆరోగ్య శాఖ కార్యదర్శి కుమారి ప్రీతి సుదాన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఒ ఎస్ డి శ్రీ రాజేశ్ భూషణ్, నీతి ఆయోగ్ సీఈవో శ్రీ అమితాబ్ కాంత్, ఐసి ఎంఆర్ డిజి డాక్టర్ బలరామ్ భార్గవ, ఫార్మా విభాగం కార్యదర్శి శ్రీ పిడి వాఘేలా, షిప్పింగ్ కార్యదర్శి శ్రీ సంజీవ్ రంజన్, జౌళి శాఖ కార్యదర్శి శ్రీ రవి చోప్రా, డిడబ్ల్యు ఎస్ కార్యదర్శి శ్రీ పరమేశ్వరన్ అయ్యర్, ఎం ఇ ఐ టి వై కార్యదర్శి శ్రీ అజయ్ ప్రకాష్ సాహ్నే, ఐటిబిపి ప్రతినిధులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌ను ముందే ఊహించిన ముంబై అడ్వకేట్

యూపి పోలీసులపై అపనమ్మకంతో పిటిషన్
ముంబై అడ్వకేట్ పిటిషన్ వేసినట్లుగానే ఎన్‌కౌంటర్

న్యూఢిల్లీ,జూలై10(ఆర్ఎన్ఎ): వికాస్ దూబే సహ నిందితులను ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎలాగైతే మట్టుబెట్టారో.. అతడిని కూడా అదే విధంగా హతమార్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒక్కసారి వికాస్ దూబేను యూపీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారంటే అతడు కచ్చితంగా హతవైపోతాడు. పోలీసులు పాత ఎన్‌కౌంటర్ కథనే మళ్లీ చెబుతారు అని ముంబైకి చెందిన న్యాయవాది ఘన్‌శ్యామ్ ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అనూహ్య పరిణామాల మధ్య మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో వికాస్ దూబే స్థానిక పోలీసుల చేతికి చిక్కిన తర్వాత గురువారం సాయంత్రమే ఆయన ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కరుడుగట్టిన నేరస్తుడైన దూబేపై తనకు సానుభూతి ఏమీ లేదని.. అయితే అక్షర్ గురు, అజ్మల్ కసబ్ వంటి దోషుల విషయంలో జరిగినట్లుగానే చట్టపరంగా విచారణ జరగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. యూపీ పోలీసుల చేతిలో దూబే అంత సులభంగా మరణం పొందేందకూడదని.. ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదనేదే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఇక పోలీసులపై దాడికి తెగబడ్డ దూబేకు పోలీస్ స్టేషన్ నుంచే సమాచారం అందడం, పలువురు ఉన్నతాధి కారులతో అతడికి సంబంధం ఉందన్న వార్తల నేపథ్యంలో.. యూపీ పోలీసుల పాలిట భస్మాసురుడిగా మారిన అతడు హతం కావడం ఖాయమని కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు. దూబే అనుచరుల ఎన్‌కౌంటర్ పై సీబీఐ విచారణ జరపడంతో పాటు.. అతడి అరాచకాల్లో పరోక్షంగా పాలుపంచుకున్న రాజకీయ నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ్ కోర్టుకు విన్నవించారు. కాగా ఉపాధ్యాయ్ ఊహించనట్లుగానే శుక్రవారం దూబే ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈరోజు ఉదయం దూబేను మధ్యప్రదేశ్ నుంచి కాన్పూర్‌కు తీసుకువస్తుండగా.. పారి పోయేందుకు ప్రయత్నించాడని.. దీంతో అతడిని ఎన్‌కౌంటర్ చేసినట్లు యూపీ పోలీసులు వెల్లడించారు. తమ దగ్గర నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపాడని, ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడినట్లు పేర్కొనడం గమనార్హం. ఇక ఈ ఎన్‌కౌంటర్‌పై యూపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

చైనాతో నేరస్తుల అప్పగింత ఒప్పంద రద్దు

కీలక నిర్ణయం తీసుకున్న ఆస్ట్రేలియా

మండిపడ్డ డ్రాగన్ దేశం

సిడ్నీ,జూలై9(ఆర్ఎన్ఎ): చైనా తీరుపై ఆగ్రహంతో ఉన్న ఆస్ట్రేలియా కీలక నిర్ణయాలు తీసుకున్నది. హాంగ్‌కాంగ్‌తో ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. ఆ దేశంలో కొత్త భద్రతా చట్టాన్ని చైనా ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మోరిసన్ చెప్పారు. అలాగే ఈ పరిణామాల నేపథ్యంలో ఇతర దేశాలకు వెళ్లే ఉద్దేశమున్న హాంగ్‌కాంగ్ పౌరులు, విద్యార్థులు, వ్యాపారులు, నిపుణులకు స్వాగతం పలుకుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు వీసా నిబంధనలను సడలించనున్నట్లు తెలిపారు. తాత్కాలిక వీసాలపై ఆస్ట్రేలియాలో ఉంటున్న హాంగ్‌కాంగ్ విద్యార్థులు, ఉద్యోగులకు ఐదేండ్ల పాటు ఉండే అవకాశం కల్పిస్తున్నామని, అనంతరం శాశ్వత నివాసం కోసం వారు దరఖాస్తు చేసుకోవచ్చని మోరిసన్ తెలిపారు. భవిష్యత్తులో ఐదేండ్ల పాటు వర్తించే విధంగా విద్యార్థి వీసాలు ఇస్తామన్నారు. మరోవైపు ఆస్ట్రేలియాపై చైనా మండిపడింది. మోరిసన్ ప్రభుత్వం తమ దేశ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జావో లిజియన్ హితవుపలికారు. లేనిపక్షంలో ఆస్ట్రేలియా ఎగుమతులపై ప్రతికూలంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్రీన్‌ఫైడ్రేను పురస్కరించుకుని తన నివాసంలో మొక్కలనుపరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి: మంత్రి

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): ఈ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ ఇచ్చిన మేరకు హైదరాబాద్‌లోని తన నివాసంలో పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తే పర్యావరణం ప్రజలను కాపాడుతుందని పేర్కొన్నారు. హరితహారంలో చెట్లను నాటుతూనే ప్రైడేని డ్రైడే గా, గ్రీన్ ఫైడ్రేగా పాటించి హరిత తెలంగాణలో భాగస్వామ్యం కావాలని కోరారు. రోజురోజుకు కరోనా వైరస్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ భౌతిక దూరం పాటిస్తూ, మాస్క్ కచ్చితంగా ధరిస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా నివాసంలో చెట్ల పొదల వద్ద నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉండే మురుగు లేకుండా మంత్రి సత్యవతి శుభ్రం చేశారు.

హైదరాబాద్ నగరాభివృద్ధిపై కేటీఆర్ ఫోకస్

నగరంలో రోడ్లు,ఫ్లై ఓవర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి
పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): నగరంలో వివిధ ప్రాజెక్టుల కింద చేపడుతున్న నగర రోడ్ల నిర్మాణం, విస్తరణపై పురపాలక శాఖ మంత్రి తారక రామారావు ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమీక్ష సమావేశానికి జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్ హాజరయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చేపడుతున్న పలు పనులకు సంబంధించి మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఆ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపిన అధికారులు త్వరలోనే మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అవసరాలతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగర మాస్టర్ ఎ÷-లాన్ కి అనుగుణంగా రోడ్ల విస్తరణ మరియు రోడ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కావాల్సిన మైక్రో ప్లానింగ్ పైన దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నూతన రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎస్ఆర్డి, హెచ్ఆర్డిసిఎల్ - సిఆర్ఎంపీ కింద చేపడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం రోడ్ల పైన జోనల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించి ఆదేశాలు జారీ చేయాలని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ జిహెచ్ఎంసి కమిషనర్ కు సూచించారు. రోడ్లకు సంబంధించిన మైక్రో ప్లానింగ్ కోసం హైదరాబాద్ నగరాన్ని నాలుగు జోన్లుగా విభజించి కొని, ఒక్కో జోన్ పైన ఉన్న ప్రస్తుతం ఉన్న రోడ్లు పాటు భవిష్యత్తులో ఏర్పాటు చేయాల్సిన రోడ్ల నిర్మాణం, ప్రస్తుత రోడ్ల విస్తరణ వంటి కార్యక్రమాలు అన్నింటి పైన ఒక సునిశితమైన నివేదిక అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదికలో ప్రస్తుతం ఉన్న రోడ్ల తో పాటు భవిష్యత్తులో రోడ్ల పైన ఏర్పడేటువంటి జంక్షన్ల అభివృద్ధి, బస్సు బేల నిర్మాణం, టాయిలెట్ నిర్మాణం వంటి ప్రతి అంశానికి సంబంధించి సమాచారం ఉండాలన్నారు. ఈ నివేదిక తయారీ కోసం రోడ్డు నిర్మాణ కన్‌స్టలెంట్ లతో, సంస్థతో కలిసి పని చేసి నెలరోజుల్లోగా ఒక ప్రాథమిక నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్ లో ప్రస్తుతం ఉన్న ప్రతి వంద అడుగుల రోడ్డుపైన కచ్చితంగా ఒక మీడియన్, గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ నగర కమిషనర్ లోకేష్ కుమార్ కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న గ్రిడ్ రోడ్లు, రేడియల్ రోడ్లు, మిస్సింగ్, లింకు రోడ్ల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలపైన కూడా మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో చేపట్టిన 23 లింకు రోడ్ల నిర్మాణం ఈ నెలాఖరు నాటికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలియజేశారు. దీంతో పాటు ప్రస్తుతం చేపట్టిన సిఆర్ఎంపి రోడ్ల నిర్వహణ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తున్నదని అధికారులు మంత్రికి తెలియజేశారు. గత నెల జూన్ లో సరాసరి 50శాతం అధికంగా వర్షపాతం నమోదైనా అప్పటికీ రోడ్లకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా రాలేని విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం మొదటి దశ సిఆర్ఎంపికి సంబంధించిన రోడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, ఫుట్పాత్లు మీడియన్లు, శానిటేషన్ నిర్వహణ వంటి అంశాల పైన తదుపరి ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి తెలియజేశారు.

నగరంలో మరో ఎలివేటెడ్ కారిడార్

11న శంకుస్థాపన చేయనున్న కెటిఆర్ : మేయర్

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): నగరంలో మరో ఎలివేటెడ్ కారిడార్ ఫ్లయ్ఓవర్ నిర్మాణం కానుంది. రూ. 426 కోట్లతో నిర్మించే ఈ కారిడార్‌కు ఈనెల 11న మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు శంకుస్థాపన చేయనున్నట్టు మేయర్ బొంతురామ్మోహన్ తెలిపపారు. ఇందులో భాగంగా 350కోట్లతో ఇందిరాపార్క్ నుంచి విఎస్‌టి వరకు మొదటి దశలో నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ స్టీల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. అదే విధంగా మరోటి రూ. 76కోట్లతో రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి ఫేజ్-2 సెకండ్‌లెవెల్‌లో నిర్మించనున్న 3లేన్ ఫ్లయ్ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నట్టు మేయర్‌తెలిపారు. ఈ పనులను 24 నెలల్లోనే పూర్తిచేయనున్నట్టు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నవేలాది వాహనదారులకు సౌలభ్యంగా ఉంటుందని అన్నారు.

కర్నాటక పోలీసులను వెన్నాడుతున్న కరోనా

బెంగళూరు సీటి 395 మంది పోలీసులకు పాజిటివ్
ఇప్పటికే ఐదుగురు పోలీసుల మృత్యువాత

బెంగళూరు,జూలై10(ఆర్ఎన్ఎ): కర్ణాటక రాజధాని బెంగళూరులో కరోనా వైరస్ కరాళ నృత్యం చేస్తోంది. బెంగళూరు సీటిలోనే 395 మంది పోలీసులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇప్పటి వరకు ఐదు మంది పోలీసులు కరోనాతో మరణించినట్లు పోలీసు ఉన్నతాధికారులు గురువారం వెల్లడించారు. గురువారం నాటికి 195 మంది కొవిడ్ నుంచి కోలుకోగా, మరో 200 మంది చికిత్స పొందుతున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. బెంగళూరులో 20 పోలీసు స్టేషన్లను మూసివేశారు. బెంగళూరులో కరోనాను తరిమికొట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో సీఎం యెడియూరప్ప నేతృత్వంలో మంత్రివర్గం సమావేశమై కరోనా కట్టడికి తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. కేబినెట్ భేటీ ముగిసిన అనంతరం న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి జేసీ మధుస్వామి మీడియాతో మాట్లాడారు. కరోనా కట్టడి చర్యల్లో భాగంగా బెంగళూరు సిటీని 8 జోన్లుగా విభజించాలని సీఎం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి జోన్ కు ఒక మంత్రి బాధ్యత వహించి.. కొవిడ్ నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని చెప్పారు. ఈ చర్యల్లో సీఎం రాజకీయ కార్యదర్శి ఎన్ఆర్ విశ్వనాథ్ కూడా భాగస్వాములు అవుతారని మధుస్వామి పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతున్న కరోనా రికవరీ

62.09 శాతానికి చేరుకుందన్న ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ,జూలై10(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా పాజిటివ్ రికవరీ కేసులు పెరుగుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఆరోగ్యమంత్రిత్వశాఖ ఓఎస్‌డీ రాజేశ్ భూషణ్ విలేకరుల సమావేశం లో మాట్లాడారు. యాక్టివ్ కేసులు,రికవరీ కేసుల మధ్య ఉన్న అంతరం క్రమంగా పెరుగుతున్నదని అన్నారు. నేడు 4,76,378 రికవరీ కేసుల్లో ప్రస్తుతం 2,69,789 యాక్టిక్ కేసులు ఉన్నాయని చెప్పారు. రికవరీ రేటు నిరంతరం పెరుగుతూ 62.09 శాతానికి చేరుకుందని వివరించారు. దేశంలో కొవిడ్-19 రికవరీ రేటు క్రమంగా పెరుగుతోందని చెప్పారు. 60 నుంచి 74 ఏళ్ల మధ్య వయసున్న వారు దేశంలో ఎనిమిది శాతమే ఉన్నారన్నారు. అయినప్పటికీ 39 శాతం కొవిడ్-19 మరణాలను చూపిస్తున్నారని, 75 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు భారతదేశ జనాభాలో 2 శాతం ఉన్నారని, కాని వారు 14 శాతం కరోనా పాజిటివ్ మరణాలను చూపిస్తున్నారని భూషణ్ పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో పాక్ జెండా షేర్ చేసిన ప్రొఫెసర్

కేసు నమోదు చేసిన యూపి పోలీసులు

లక్నో,జూలై10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఒకరు ఓ సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ సైట్‌లో పాకిస్తాన్ జెండాతో పాటు ఆ దేశ మ్యాప్‌ను పోస్టు చేయడంపై కేసు నమోదు చేసినట్టు యూపీ పోలీసులు వెల్లడించారు. వీహెచ్‌పీ నేత వీరూ భరద్వాజ్ ఫిర్యాదు మేరకు బారాదార్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు. బరేలీలోని రోహిల్‌ఖండ్ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సలీం ఖాన్.. పాకిస్తాన్ జెండాను షేర్ చేసుకోవడం ద్వారా ప్రజల మనోభావాలను దెబ్బతీశారంటూ భరద్వాజ్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నట్టు బారాదార్ ఇన్‌స్పెక్టర్ శీతాన్షు శర్మ పేర్కొన్నారు. కాగా తన పోస్టుపై ఇప్పటికే సదరు ప్రొఫెసర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అనిల్ కుమార్ శుక్లాకి క్షమాపణ చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారాన్ని యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ముందు పెడతామని వీసీ చెప్పినట్టు సమాచారం.

ఎస్ బ్యాంక్ కేసులో ఇడి దూకుడు

-రాణా కపూర్‌కి చెందిన రూ.2,203 కోట్ల ఆస్తుల జప్తు

న్యూఢిల్ల

పర్యాటకంగా అన్నారం, పర్వతగిరి ప్రాంతాల అభివృద్ధి

రూర్బన్ ప్రాజెక్టు కింద నిధుల ఖర్చు
ఆయా ప్రాంతాల్లో పర్యటించి మొక్కలు నాటిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,జూలై10(ఆర్ఎన్ఎ): అన్నారం షరీఫ్, పర్వతగిరి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు ప్రకటించారు. అన్నారం చెరువు తదితర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూర్బన్ ప్రాజెక్టు పర్వతగిరి అభివృద్ధికి సరిగ్గా సరిపోతుందని ఈ ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించామని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. ఇక్కడి ప్రజల అవసరాలకనుగుణంగానే ఆయా అభివృద్ధి పనులను మొదటి విడతగా వచ్చిన 30కోట్లతో త్వరలోనే చేపడతామని అన్నారు. రూర్బన్ ప్రాజెక్ట్‌కింద మంజూరైన మొదటి విడత నిధులలో భాగంగా ఖరారైన పనులను స్వయంగా మంత్రి ఎర్రబెల్లి వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరిరమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈసందదర్భంగా పర్వతగిరి ఊర చెరువువద్ద మొక్కలు నాటారు. చెరువుకట్టను పరిశీలించారు. చెరువును విశాలం చేయాలన్నారు. వచ్చే ఏడాది నుంచి దసరా ఉత్సవాలు అక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అన్నారం దర్గా చెరువును కూడా మంత్రి పరిశీలించారు. కట్టవెంట నడిచారు. చెరువును పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. చెరువునే కాదు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా ఆయన మొక్కలు నాటి దర్గాను దర్శించుకున్నారు. దారిలో తనకు ఎదురైన పలువురు ఉపాధిహామీ కూలీలకు మంత్రి

మాస్కులను పంపిణీ చేశారు. రూర్బన్ ప్రాజెక్ట్ నిధులపై తాను గతంలో అవగాహనతో పనిచేసినట్టు చెప్పారు. మధ్యలో ప్రాజెక్ట్‌ను నిలిపివేశారు. తర్వాత సీఎం కేసీఆర్ ద్వారా కేంద్రానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తిచేశావన్నారు. అనేక ప్రయత్నాల తర్వాత మొదటి విడతగా 30కోట్లరూపాయలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో పర్వతగిరి ప్రాంతాన్నిఅభివృద్ధి చేస్తామన్నారు. అన్నారం షరీఫ్, పర్వతగిరిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధుల సహకారంతో అన్నారం రోడ్డు పోడవునా షట్టర్లు వేసి ఇవ్వాలని, మాంసం కేంద్రం నిర్మించాలని, కబేళాను కట్టించాలని, స్కూల్ భవనాన్ని నిర్మించానలి, ప్రస్తుత స్కూల్ ఉన్న ప్రాంతంలో బస్టాండ్ నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రాంతం వాడిగా దీనిని అభివృద్ధి పరిచి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి తెలిపారు. దీనికి ప్రజల సహకారం కావాలన్నారు. మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రైతు సంక్షేమం కోసమే వేదికల నిర్మాణం: ఎంపి

వరంగల్ రూరల్,జూలై10(ఆర్ఎన్ఎ): రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో రైతు వేదిక నిర్మాణ పనులకు ఎంపీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరవ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మంకి ఫుడ్ కోర్టులో పండ్ల మొక్కలను అదేవిధంగా ప్రధాన రహదారికి ఇరువైపులా నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతు అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో పెరుగుతున్న కేసులు

సిఎం పళనిస్వామితో కేంద్రబృందం భేటీ

చెన్నై,జూలై10(ఆర్ఎన్ఎ): తమిళనాడు రాష్ట్రంలో కరోనా రోజురోజుకూ విస్తరిస్తుండడంతో పరిస్థితిపై ఆ రాష్ట్ర సీఎం యడప్పాడి పళనిస్వామి కేంద్ర బృందంతో చర్చించారు. శుక్రవారం చెన్నైలో కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఆర్తీ అహుజా నేతృత్వంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కరోనా మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్రం బృందం సీఎంతో సమీక్షించింది. రాష్ట్ర రాజధాని చెన్నైలో అధికంగా కేసులు నమోదవుతుండడానికి గల కారణాలు అడిగి తెలుసుకుంది. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, ఆరోగ్యశాఖ మంత్రి విజయభాస్కర్, ఆరోగ్యశాఖ కార్యదర్శి రామకృష్ణన్‌తోపాటు సీనియర్ అధికారులతో కేంద్రం బృందం సభ్యులు సమావేశమయ్యారు. దేశంలో మహారాష్ట్ర తరువాత అత్యధిక కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నది తమిళనాడు రాష్ట్రంలోనే. ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో 1,26,581 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ తన నివేదికలో వెల్లడించింది.

ముంబై-గోవా రహదారిపై విరిగిపడ్డ కొండచరియలు

ముంబై,జూలై10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లా పోలాద్‌పూర్ పట్టణానికి సమీపంలో ఉన్న ధమండేవి గ్రామంలో నిన్న కొండచరియలు విరిగిపడటంతో ముంబై, గోవా రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. రహదారిపై పడిన శిథిలాలను మున్సిపల్ సిబ్బంది, పోలీసులు తొలగిస్తున్నారు. పోలాద్‌పూర్ సమీపంలోని ధమండేవి గ్రామంలో నిన్న రాత్రి 9:30 గంటలకు కొండచరియలు విరిగిపడినట్లు హైవే పోలీసులు తెలిపారు. శిథిలాలు ఎక్కువగా ఉండడంతో రోడ్డు పూర్తిగా మూసివేసినట్టు సిబ్బందిదన్నారు. ఈరోజు ఉదయం 6:30 వరకు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగానే కొండ చరియలు విరిగి పడవచ్చని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నారు. లోకల్ టు గ్లోబల్.. వార్త ఏదైనా.. అన్నీ ఒకే యాప్‌లో. నమస్తే తెలంగాణ ఆండ్రాయిడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి.

సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం,జూలై10(ఆర్ఎన్ఎ): సీతారామా ప్రాజెక్ట్ పనులకు జిల్లాలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, సీఎంవో సెక్రటరీ స్మితా సబర్వాల్ పరిశీలించారు. సిఎం కెసిఆర్ ఆదేశాలతో ఈ పనులను వారు పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్, ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ మురళిధర్ కూడా వీరివెంట ఉన్నారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు దగ్గర సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ పనులు జరుగుతున్నాయి. పనుల పురోగతిపై ఎన్ఈ, సీఈ లను వివరాలడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం పనులు వేగంగా చేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించారు.

ప్రహసనంగా మారిన కరోనా మృతుల అంత్యక్రియలు

మృతదేహాలను అడ్డుకుంటున్న స్థానికులు
అధికారులకు తలనొప్పిగా అంతిమ సంస్కారాలు

హైదరాబాద్,జూలై10(ఆర్ఎన్ఎ): కరోనా పాజిటివ్ వచ్చిన రోజుగుల ఆస్పత్రుల్లో నరకం అనుభవిస్తు న్నామని, తమ స్వీయనుభవాలను సెల్ఫీల ద్వారా వెల్లడిస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దందా నడుస్తుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు లేవంటూ రోగులు వాపోతున్నారు. ఇదిలావుంటే చనిపోయిన వారిని ఖననం చేయడం, లేదా దహనం చేయడం సిబ్బందికి తలనొప్పిగా మారింది. అనేకచోట్ల స్థానికులతో తలనొప్పులు వస్తున్నాయి. కరోనా సోకిన వారి శవాలను శ్మశాన వాటికకు తీసుకుని రానివవ్వమని అడ్డుకుంటున్నారు. దీనిపై ఆయా ప్రాంతాల్లో మున్సిపల్, పంచాయితీ సిబ్బందికి తలనొప్పిగా మారింది.

అంత్యక్రియలు పూర్తి చేసేందుకు కుటుంబ సభ్యులను కూడా అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యుల మానసిక వేదన వర్ణనాతీతంగా ఉంటోంది. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దూరంగా కూర్చుని మృతదేహాన్ని చూడటం మినహా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోతున్నారు. మృతుడి వివరాల నమోదు హైదరాబాద్ అయితే జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగిండం, వారు ప్యాకింగ్ చేసి అంత్యక్రియలు పూర్తి చేసే కార్యక్రమాలు చేపట్టడం పెద్ద తంతుగా మారింది. చాలాచోట్ల దారుణంగా అనాథ శవాల్లా తీసుకుని వెళ్లి అంత్యక్రియలను పూర్తి చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఒక్క కరోనా రోగి మృతదేహానికి అంత్యక్రియలు పూర్తయ్యేందుకు పెద్ద ప్రహసనమే జరుగుతోంది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ దహన వాటికల మరమ్మతుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. కానీ వీటి మరమ్మతు పనులను కూడా స్థానికులు అడ్డుకుంటున్నారు. దహన సంస్కారాలు ఇక్కడ నిర్వహించవద్దని అభ్యంతరం తెలుపుతున్నారు. అంబర్‌పేట విద్యుత్ దహన వాటిక వద్ద మరమ్మతు చేసి ఓ మృతదేహాన్ని కాల్చాలని అక్కడి నిర్వాహకులు భావించగా... స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. దహన వాటిక పునరుద్ధరించవద్దని డిమాండ్ చేస్తున్నారు. దహనం చేసే సమయంలో వచ్చే దుర్వాసనతో స్థానికులు కేన్సర్, లివర్, శ్వాససంబంధ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బన్సీలాల్‌పేట దహన వాటికలో మృతదేహాలను కాల్చవద్దని స్థానికులు అడ్డుకున్నారు. గ్రేటర్‌లో కరోనా మృతుల అంత్యక్రియలు నిర్వహించే పనిని జీహెచ్ఎంసీ ఓ ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్టుకు అప్పగించింది. వీరు జీహెచ్ఎంసీ ఇచ్చిన సమాచారం మేరకు ఆయా ఆస్పత్రులకు వెళ్లి అక్కడ నుంచి మృతదేహాలను సంబంధిత శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తారు. సాధారణంగా కరోనా మృతదేహాల అంత్యక్రియలకు సుమారు 8 నుంచి 9 గంటల సమయం పడుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో కరోనా మృతుల సంఖ్య పెరగడంతో అంత్యక్రియలకు ఎక్కువ సమయం పడుతోంది. ప్రస్తుతం అంత్యక్రియల కోసం 15 అంబులెన్స్‌లను వినియోగిస్తున్నారు. మరిన్ని అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు రచిస్తోంది. మృతుల అంత్యక్రియలు సమీక్షించేం దుకుప్రత్యేక కమిటీ ఉంది. ఆస్పత్రిలో ఎవరైనా కరోనా చికిత్స పొందుతూ చనిపోతే వెంటనే వైద్యులు స్థానిక నోడల్ మెడికల్ అధికారికి సమాచారమిస్తారు. ఆయన జీహెచ్ఎంసీకి తెలియజేస్తారు. జీహెచ్ఎంసీ ప్రైవేట్ సంస్థకు సమాచారం ఇస్తుంది. అంబులెన్స్‌లో ప్రైవేట్ సంస్థ హ్యాండ్లర్స్ ఆస్పత్రికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని,శవాన్ని ప్యాక్ చేస్తారు. మృతదేహాన్ని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేస్తారు. ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన ఐదుగురు హ్యాండ్లర్స్ పీపీఈ కిట్లు ధరించి తమ పనులు పూర్తి చేస్తారు. మృతదేహం వద్దకు వెళ్లేముందు వీరు పీపీఈ కిట్ ధరిస్తారు. మృతదేహంపై లిక్విడ్ స్ప్రే చేసి తెల్లటి వస్త్రంలో చుడతారు. తర్వాత దానిని గాలికూడా చొరబడని బ్లాక్ కవర్‌లో పెడతారు. శవంపై కెమికల్ స్ప్రే చేస్తూ శ్మశాన వాటికకు తీసుకెళతారు. ముస్లిం అయితే పూడ్చిపెడతారు. హిందూ అయితే సంప్రదాయం ప్రకారం దహనం చేసి కుటుంబ సభ్యులకు బూడిద అందజేస్తారు. వర్షం కారణంగా మృతదేహాన్ని కాల్చేందుకు ఎక్కువ సమయం పడుతుంది. శరీరం పూర్తిగా దహనం కావాలంటే నాలుగు గంటలు, ఎలక్ట్రికల్ క్రిమిటోరియల్‌లో గంట సమయం పడుతుంది. ఇప్పటి వరకు అంబర్‌పేట, పంజాగుట్ట, ఈఎస్ఐ శ్మశానవాటికల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం కావడంతో మరింత ఆలస్యం అవుతోంది.ప్రభుత్వ ఆస్పత్రులు, హోం క్వారంటైన్‌లో ఉన్న వారు కరోనా సోకి చనిపోతే జీహెచ్ఎంసీ ఎలాంటి రుసుము లేకుండా అంత్యక్రియలు నిర్వహిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చనిపోయిన వారి నుంచి కూడా ఎలాంటి చార్జీలు తీసుకోవడంలేదు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అంత్యక్రియలకు రూ. 25వేలు వసూలు చేస్తున్నారు.

జిల్లాల విభజనను శాస్త్రీయంగా చేపట్టాలి

నియోజకవర్గాల వారీ విభజన సరికాదు
2026లో నియోజకవర్గాల విభజన జరుగనుంది
ప్రభుత్వానికి మాజీమంత్రి సోమిరెడ్డి సూచన

ంఅమరావతి,జూలై10(ఆర్ఎన్ఎ): పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన జిల్లాల సంఖ్య పెంచాలనే యోచన కరెక్ట్ కాదని టీడీపీ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందులో మంచీచెడులను విచారించాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాను రెండుగా విభజించవద్దని సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాద్ రావు కూడా డిమాండ్ చేశారు. విజయనగరం, నెల్లూరు, కడప, శ్రీకాకుళం లాంటి జిల్లాలను విభజించి పెంచాల్సిన అవసరం లేదని సోమిరెడ్డి అన్నారు. అనంతపురం, చిత్తూరు, గోదావరి లాంటి పెద్ద జిల్లాలను విభజించినా ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. పార్లమెంట్ నియోజకవర్గం ఒక జిల్లా అనడంలో న్యాయం లేదు. 2026లో మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది.

పార్లమెంట్ నియోజకవర్గాల హద్దులు మారిపోతాయి. అప్పుడు మళ్లీ జిల్లాలను మారుస్తారా అని అన్నారు. 1985కి ముందు పంచాయతీ సమితులు ప్రజలకు పరిపాలనపరంగా సౌలభ్యంగా లేవు. సమితి పరిధిలోని గ్రామాలకు, సమితి కేంద్రానికి 150 కిలోవి ాటర్లు కూడా ఉన్న పరిస్థితి. అప్పట్లో ఎన్టీ రామారావు సమితులను రద్దు చేసి మండల వ్యవస్థ తెచ్చారు. ఈ రోజుకీ మండలాలు చిరస్థాయిగా నిలిచి ప్రజలకు పరిపాలన పరంగా ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. ఇప్పుడు కూడా పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన కాకుండా అవసరమైన చోట పెంచితే అభ్యంతరం లేదని టిడిపి నేత అన్నారు. తెలంగాణలోనూ అతిగా చేసి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మార్చి ప్రాముఖ్యత లేకుండా చేసేశారు. జిల్లా అంటే ఒక విలువ ఉండాలి. నెల్లూరు పార్లమెంటు నియోజకవ ర్గాన్ని విభజిస్తే కృష్ణపట్నం పోర్టు, షార్, శ్రీసిటీ అన్నీ తిరుపతి పరిధిలోకి పోతాయి. నెల్లూరు ప్రాముఖ్యతను కోల్పోతుంది. ఉదాహరణకు నా స్వగ్రామం అల్లీపురం నెల్లూరు నగరపాలక సంస్థలో ఉంది. అల్లీపురం నెల్లూరు కలెక్టరేట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటే మా పొరుగునే ఉన్న నరుకూరు, చిన్నచెరుకూరు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. జిల్లాల విభజన జరిగితే ఆ రెండు గ్రామాలు తిరుపతి జిల్లా పరిధిలోకి వెళ్తాయి. ఆయా గ్రామాల ప్రజలు తిరుపతి కలెక్టరేట్‌కి వెళ్లాలంటే నెల్లూరును దాటుకుని 150 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకోండి. ఏదో మేమనుకున్నది చేయాలనే ధోరణి వద్దు. ప్రజలకు చిరస్థాయిగా ఉపయోగపడేలా, సౌకర్యవంతంగా జిల్లాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి సోమిరెడ్డి విజ్ఞప్తి చేశారు.ం



నాగార్జున సాగర్ నియోజకవర్గంలో రైతు వేదిక నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి. చిత్రంలో ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, కిశోర్, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

సిఎం కెసిఆర్ పేదల పక్షపాతి: పురాణం

మంచిర్యాల,జూలై10(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అని ఎమ్మెల్సీ పురాణం సతీష్ అన్నారు. మంచిర్యాల జిల్లా కొటపల్లి మండలం పంగిడిసోమారం గ్రామానికి చెందిన పొసక్కకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ. 25 వేల చెక్కును ఎమ్మెల్సీ లబ్దిదారుడికి నేడు అందజేశారు. ఈ సందర్భంగా పురాణం సతీష్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదలకు అందాలని తపన ఉంటుందన్నారు. గతంలో బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరగాలంటే ఆఫీసుల చుట్టా తిరగాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. లబ్దిదారులకే నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

ఎపిలో కరోనాకు మరో 15మంది మృతి

రాష్ట్రంలో 1576కు చేరిన కేసుల సంఖ్య

అమరావతి,జూలై10(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారికి మరో 15 మంది బలి అయ్యారు. తాజాగా రాష్ట్రంలో 1576 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం విడుదల చేసిన హెల్త్ బులిటిన్‌లో వెల్లడించారు.

ఇప్పటివరకు 11లక్షల 15వేల 635 కరోనా పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. 13,194 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అనంతరం కోలుకొని డిశ్చార్జి అయ్యారని వివరించారు. 11936 మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అనంతపురంలో 191కేసులు, తూర్పుగోదావరిలో 169, కర్నూలు, పశ్చిమగోదావరిలో 144 చొప్పున, గుంటూరులో 136, ప్రకాశంలో 110 కరోనా కేసులునమోదు అయ్యాయి. చిత్తూరు జిల్లాలో ఈ ఒక్కరోజే అత్యధికంగా 208 కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 292 మంది కరోనా బారిన పడి మృతిచెందారు.

పర్వతగిరి మండల అభివృద్ధి పనులకు మంత్రి ఎర్రబెల్లి శ్రీకారం

వరంగల్ రూరల్,జులై 10: జిల్లాలోని పర్వతగిరి మండల అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేడు శ్రీకారం చుట్టారు. పర్వతగిరి మండల కేంద్రంలో హరితహారంలో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. అనంతరం రూర్బన్ పథకంలో భాగంగా చేపట్టిన పర్వగిరి, అన్నారం ఊరచెరువు కట్టలను వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. రూర్బన్ ప్రాజెక్టు కింద మంజూరైన రూ.30 కోట్లతో పర్వతగిరి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. పర్వతగిరి మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు ఖరారు చేశారు. ఎమ్మెల్యే ఆరూరి రమేష్, సంబంధిత అధికారులతో కలిసి ఆయా పనులపై మంత్రి స్వయంగా క్షేత్ర పరిశీలన చేశారు.

పాక్ విమానాలపై అమెరికా ఆంక్షలు

నకిలీ పైలట్ లైసెన్సుల ఆరోపణల నేపథ్యంలో నిర్ణయం

వాషింగ్టన్,జూలై10(ఆర్ఎన్ఎ): నకిలీ పైలట్ లైసెన్సుల వివాదం పాకిస్థాన్‌ను వెంటాడుతోంది. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ పాకిస్థాన్ అంతర్జాతీయ విమానసంస్థ(పీఐఏ)పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. తాజాగా అమెరికా కూడా అదేదారిలో ముందుకెళ్లింది. పాకిస్థాన్ నుంచి అమెరికాకు నడిచే పీఐఏ చార్టర్ విమానాల అనుమతిని రద్దుచేస్తున్నట్లు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రకటించింది.

పాకిస్థాన్‌లో సగానికిపైగా పైలట్ లైసెన్సులు నకిలీవని తేలడంతో ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) కూడా పీఐఏ విమాన సర్వీసులపై ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో సదరు విమాన సంస్థ సర్వీసులను అమెరికా రాకుండా నిషేధించింది. అయితే, దిద్దుబాటు చర్యలు ద్వారా ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని పీఐఏ స్థానిక మీడియాకు వెల్లడించింది. పాకిస్థాన్‌లో ఇప్పటివరకు జారీయైన పైలట్ లైసెన్సుల్లో ఎక్కువశాతం చెల్లనివని అక్కడి ప్రభుత్వ నివేదిక స్పష్టం చేసింది. దేశంలో 860క్రియాశీల పైలట్ లైసెన్సులుండగా వీటిలో దాదాపు 262లైసెన్సులు సందేహాస్పదంగా ఉన్నాయని తేలింది. దీనిపై పాకిస్థాన్ పార్లమెంటులోనూ చర్చ జరిగింది. కేవలం పాకిస్థాన్ అంతర్జాతీయ విమానయానసంస్థ(పీఐఏ)లోనే మూడోవంతు పైలట్లు తప్పుడు విధానంలో లైసెన్సులు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పీఐఏలో దాదాపు 434మంది పైలట్లు ఉండగా, వీరిలో 141 లైసెన్సులను పాకిస్థాన్ విమానయానశాఖ ఇప్పటికే రద్దు చేసింది. పాకిస్థాన్‌లో మే నెలలో పీఐఏ విమానం కుప్పకూలి 97మంది మృత్యువాతపడిన అనంతరం జరిగిన దర్యాప్తులో ఈ నకిలీ పైలట్ లైసెన్సుల వ్యవహారం బట్టబయలైంది.

ఎదురుకాల్పుల్లో నలుగురు మావోల హతం

పాట్నా,జూలై10(ఆర్ఎన్ఎ): బిహార్‌లో పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సల్స్ హతమయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ చంపారన్ జిల్లా బగహా ప్రాంతంలో నక్సల్స్ తిరుగుతున్నారన్న సమాచారంతో పోలీసులు శుక్రవారం ఉదయం గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురుపడ్డ నక్సల్స్.. పోలీసులపైకి కాల్పులు జరిపారు. దీంతో ఎదురుకాల్పులు ప్రారంభించడంతో నలుగురు నక్సలైట్లు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఆపరేషన్‌లో బిహార్ పోలీసులతో పాలు సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) బలగాలు పాల్గొన్నాయి. సంఘటనా స్థలంలో మూడు అత్యాధునిక తుపాకులు, భారీ పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

పూంతూరాలో హోం క్వారంటైన్

వైద్యం అందడం లేదంటూ ప్రజల నిరసన

తిరువనంతపురం,జూలై10(ఆర్ఎన్ఎ): కేరళలో కరోనా వైరస్ సమూహ వ్యాప్తి దశకు చేరిందన్న వార్తలు వినిపిస్తున్నాయి. తిరువనంతపురంలోని పూంతురా ప్రాంతంలో కరోనా వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారందరిని హోం క్వారంటైన్ చేశారు.

అక్కడ ఆంక్షలు విధించడం తోపాటు కమాండోలను మోహరించారు. మరోవైపు తమకు వైద్య సదుపాయాలు అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ ప్రాంత వాసులు ఆందోళనకు దిగారు. వైద్యం కోసం దవాఖానలకు అనుమతించకపోవడంపై మండిపడ్డారు. అక్కడ భారీగా మోహరించిన పోలీసుల ఎదుట తమ నిరసన తెలిపారు.

మొక్కలు నాటిన జబర్దస్త్ అవినాష్, నేహంత్

హైదరాబాద్, జులై 10త: జబర్దస్త్ నటులు ముక్కు అవినాష్, నేహంత్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించి మొక్కలు నాటారు. జబర్దస్త్ రాకేష్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌ను స్వీకరించిన వీరు నేడు నగరంలోని నానక్‌రామ్‌గూడలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ... ఎంపీ సంతోష్‌కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. మనందరం మంచి ఆరోగ్యంతో ఉండాలంటే మంచి వాతావరణం అవసరమని అందుకే అందరూ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలన్నారు.

ఈ సందర్భంగా అవినాష్, నేహంత్‌లు పలువురికి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు. యాంకర్ రాధ, అదిరే అభి, కెవ్వు కార్తిక్, నిహారిక కొణిదెల, యోద, యానీమాస్టర్‌లను మొక్కలు నాటాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహవ్యవస్థాపకుడు రాఘవ, ప్రతినిధి కిషోర్ గౌడ్, గచ్చిబౌలి కార్పొరేటర్ సాయిబాబా పాల్గొన్నారు.

పిపిఇ కిట్లు ఇవ్వాలంటూ ఇవ్వాలంటూ ఆశా వర్కర్ల ఆందోళన

బెంగళూరు,జూలై10(ఆర్ఎన్ఎ): కరోనాను ఎదుర్కొనే క్రమంలో తమను నిర్లక్ష్యం చేయడం తగదని ఆశా వర్కర్లు అన్నారు. తరమకు జీతాలు, పిపిఇ కిట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదన్నారు. కర్ణాటకలోని ఆశా వర్కర్లు శుక్రవారం బెంగళూరులో ధర్నా చేశారు. కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్నప్పటికీ తమ ప్రాణాలను లెక్కచేయక విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పీపీఈ కిట్లు సమకూర్చాలని, నెలకు రూ.12 వేలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీని గురించి అధికారులకు పలుమార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఏఐయూటీసీ అనుబంధ సంఘానికి చెందిన ఆశా వర్కర్లు శుక్రవారం విధులు బహిష్కరించి ధర్నా చేశారు.ం

పివి ఎక్స్‌ప్రెస్ హైవేపై కార